# కావ్యము - శిల్పము

★

శ్రీ వాకాటి పాండురంగారావు

## 1

"శిల్పానికన్నా కావ్యమే గొప్పది" మళ్ళీ అన్నాడు కవి ప్రభాకరుడు. శిల్పి అజయుడా మాటలను అంగీకరించలేదు.

నీలద్వీపపు ఉపవనంలో, నిండు చూలాలి వేగంతో ప్రవహించే సెలయేటి సంగీతపు కలకలంలో ప్రభాకర అజయులమధ్య పెరుగుతూన్నది వాదం. పంక్తులలోని గుర్తులవలె వారిరువురి వాదోపవాదాల మధ్య ఒకొక్కప్పుడు మెల్లని నవ్వుశబ్దం వినపడుతూంది. కాని వాదంమాత్రం నిర్విరామంగా సాగుతూనే వుంది.

ఆ ఉపవనంలో ప్రభాకరుడూ అజయుడూ తీవ్రంగా చర్చలు జరుపుతూంటే మూర్తీభవించిన మానమా అన్నట్లు చేతిమీద చెక్కిలి నానించి కూర్చుని వారి మాటలను శ్రద్ధగా ఆలకిస్తున్నది మనోహరి.

"శిల్పానికున్న ప్రాముఖ్యమూ మహిమా కావ్యానికి లేదు" అజయుడు నొక్కి వక్కాణించాడు. అతడా మాటలను పెద్దరాయి బ్రద్దలవగా ముక్కలు ఎగిరిపోతున్న ధోరణిలో అన్నాడు.

"శిల్పం! హూ—గాలికీ వానకూ తట్టుకోలేనిది ఈ నీశిల్పం. కాలగర్భంలో కనబడకుండా కలిసిపోతుంది నీ శిల్పం. కావ్యమో? అలాంటిది కాదు. మనుష్యులు ఒకరితో ఒకరు మాటలాడుతున్నవరకూ, భాష ఈ లోకంలో ఉన్నంతకాలమూ ఉంటుంది కావ్యం! మనస్సుతోనూ కాలంతోనూ పరుగులిడుతుంది కావ్యం"—అన్నాడు ప్రభాకరుడు. ఎత్తైన పర్వతాలనుండి క్రిందకు పడుతున్న జలపాతపు ధ్వని అతని మాటలలో ప్రతిధ్వనిస్తూంది.

కాస్త దూరంలో ఉండి మనోహరి విడువకుండా వింటున్నది. వీరి కెదురుగా చతుస్తంభ మంటపంలో కూర్చుని వీరి వాదోపవాదాల ధోరణిని ముగింపును ఆవంతయినా లక్ష్యం చేయక మనస్సుకు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని అనుగ్రహించి ఊహాలోకంలో ఊగులాడుతున్నాడు వసంతుడు.

"శిల్పానికి పొడవు, వెడల్పు, ఎత్తు అనే మూడు ఆధారాలున్నాయి. వాటిమీదుగా శిల్పలత ప్రాకి పెద్దదై పూవులూ ఫలాలూ వెదజల్లుతుంది"—అన్నాడు అజయుడు.

"ఔను. అట్లా మూడు ఆధారాలుండబట్టే శిల్పానికి హద్దు లున్నాయంటున్నాను. శిల్ప మా ఎల్లల బయటికి అడుగిడలేదు. కానీ కావ్యానికి ఈ ఎల్లలు లేవు. కావ్యలతకు ఆధారం మానవుని మనసే. అది ఈ ప్రపంచానికన్నా విశాలమైనది. మహాసముద్రాలకన్నా లోతైనది. ఆకారంలేని ఆవేశపు ఆధారంతో కవిత్వం ఆ చంద్రార్కస్థాయిగా నెలకొని విరాజిల్లుతుంది... ఈ విషయం మనోహరికి బాగా తెలుసు"—అని ప్రభాకరుడు పలికాడు.

అపుడే వికసిస్తూన్న మొగ్గలాంటి మందహాసం మెరిసింది మనోహరి మృదు మధురాధరాలమీద.

అజయు డిలా అన్నాడు: "కాదు. మనోహరికి శిల్పంమీదే ఆసక్తి ఎక్కువ. ఈ వనమంతటా ఆమె వివిధరూపాలను చెక్కి ప్రతిష్ఠిస్తాను నేను. అపుడీ శిల్పపు గొప్పతనం ఆమెకు ఇంకా బాగా అవగతమౌతుంది.

వాదనలోని రసవత్తరమైన ఘట్టంలో ఈ లోకానికి వచ్చిన వసంతు డొక్కసారి నవ్వాడు.

"నవ్వకు!... నీవే చెప్పు ఏది గొప్పదో? శిల్పమా? కావ్యమా?" అజయుడు ప్రశ్నించాడు.

వసంతు డిలా ప్రత్యుత్తర మిచ్చాడు: "ఏది గొప్పదన్న చింతే నాకు లేదు. శిల్పమూ కావ్యమూ-రెండింటి అనుభూతులుగూడా అనుభవించి ఆనందింపదగినవే. నాకు తెలిసిందంతే... ఇక అనుభూతి అంటారా అది కావ్య శిల్పాలకేగాక ఒక చిన్న పుష్పానికికూడా ఉంది."

ఈ తరుణంలోనే మనోహరి ఒక్కసారి పెద్దగా నవ్వింది. ఆ ఉపవనపు హృదయశబ్దంవలె, ఆ ప్రక్కనే ప్రవహిస్తున్న స్రవంతీ నాదంవలె, వనదేవత కాలి అందెల చప్పుడువలె ఉండిన దామె

నవ్వు! ఆమె లేచి మెల్లగా అడుగుమీద అడుగువేస్తూ నడువసాగింది.

"వివాదం ఇంకా ముగియలేదు కదూ?" అని అజయుడు అడిగాడు. "లేదు. ఈ వివాదపు అంతం తేల్చవలసింది మనోహరియే కదా!" అని బదులిచ్చాడు ప్రభాకరుడు.

"చూదాం! మీరే ఏ ముగింపు కోస్తారో?" అని పలుకుతూ రాయంచల పద విన్యాసంతో నడచింది మనోహరి.

ఆ పలుకులను తమతమ ఎదలలో పదిలపర్చుకున్నారు ప్రభాకర అజయు లిద్దరూ.

## 2

నీలద్వీపపు ఉపవనం కళామంటపంగా తయారయింది. వనమంతటా మనోహరి మూర్తి వివిధ భంగిమల్లో వెల్లివిరిసింది. ఆమె నడుస్తూ ఉన్నట్లు, నాట్యమాడుతున్నట్లు, నిలిచి దేన్నో చూస్తున్నట్లు, నవ్వుతున్నట్లు—నవయౌవనవిలాసినీ హావ భావ విలాసాలు ఎన్ని రూపాలు దాల్చగలవో అన్ని రూపాలలో ఆమె శిల్ప ప్రతిబింబాలు ఆ ఉపవనమంతటా నిండిఉన్నాయి!

ఈ శిల్పరూపాలమధ్య కవితా పుష్పం కూడా విప్పారి తన సౌరభాన్ని మలయమారుతంతో మిళితం చేస్తూఉన్నది. ఆమె నడకల ఒయ్యారాన్ని వర్ణిస్తూ, నిలిచిఉన్నప్పటి ఆమె హొయలును చిత్రిస్తూ, ఆమె చిరునవ్వు అందాన్ని ఆలాపిస్తూ, యౌవనపు బిగిలోని సుందరయువతి చేష్టలన్నీ మనోజ్ఞమైన కవితారీతిలో అభివర్ణింపబడ్డాయి! ప్రతి శిల్పంక్రిందా ఒక పద్యం! ప్రతీ శిల్పం పీఠంపైనా ఒక గీతం!

కవిత్వమూ, శిల్పమూ, ప్రణయవాహిని వేగానికి తట్టుకొనలేక ఉక్కిరి బిక్కిరవుతూ తమ తమ ప్రభావాలను చూపడానికై పోటీకి దిగాయి ఆ ఉపవనంలో!

వసంతుడో? ఈ కళా వైదగ్ధ్యానికి అక్కజపడుతూ ఈ మహోత్కృష్ట శిల్పకావ్యాల కాధారభూతమయిన మనోహరమూర్తిని మనసార ధ్యానించి తన్మయత్వపుటంచుల్లో తారాడుతున్నాడు!

మళ్ళీ అందెల రవళి, నక్షత్రాలను జ్ఞప్తికితెచ్చే చిరునవ్వు—ప్రతిధ్వనించాయి. మనోహరి అక్కడకు వచ్చింది.

"మనోహరీ! చెప్పు. శిల్పమూ కావ్యమూ నిన్ను ఆరాధిస్తున్నాయి. దేన్ని అనుగ్రహిస్తావ్?"—శిల్పి ప్రశ్న.

అందుల కామె నవ్విన నవ్వు ప్రభాకరునిచేత ఒక గీతాన్ని ఆలాపింపచేసింది.

"చూదాం! మీరే ఏం ముగింపు కోస్తారో?" ...ఈ మాటలనంటూ మనోహరి నెమ్మదిగా సరస్సు దిశను నడిచింది. కనురెప్ప నార్పకుండా ఆమెవైపే చూచి తన్ను తాను మరచిపోతున్నాడు వసంతుడు.

## 3

పున్నమనాటి వెన్నెలలో జలకమాడుతున్నది నీలద్వీపం! నిశ్శబ్దంగా ఉన్న ఉపవనంలో అంత రాత్రివేళ శిలల ముందర మౌనంగా నిలబడి కండ్లనీరు కారుస్తున్నాడు వసంతుడు! అంతకు క్రిందురోజు కళానైపుణ్యానికి తార్కాణాలుగా నిలబడి వుండిన శిల్పమూర్తులు నేడు ఛేదింపబడి ఉన్నై!!

"అసూయ ఎంత చెడ్డదీ?..." నిట్టూర్పు విడిచాడు అతడు.

"రాయి నశిస్తుంది—అన్న నైజాన్ని నిరూపించడానికై వీటిని నాశనం చేసివున్నట్లయితే ఆ వ్యక్తి కళాభిజ్ఞత ఎటువంటిదో కదా? అసూయ కళాభిరుచికన్నా మహిమా సమన్వితమైనదా? అసూయ ఉన్నచోట వస్తువుల అందచికారాలూ, మంచిచెడ్డలూ మరుగున పడతాయా?"—తనలో తానే అనుకున్నాడు.

కాలిఅందెలల చప్పుడు వినపడింది. వసంతుడు తిరిగిచూచాడు. పుష్పభరితములైన పూలమొక్కల మధ్య అతివేగంతో ఎవరో నడచి వెళుతున్నట్లు తెలిసింది. తనలో తానే నవ్వుకుంటూ ఉపవనంనుండి వెళ్ళిపోతున్నది మనోహరి.

## 4

మరుసటి రోజు రాత్రి అదేసమయానికి నిలబడి కన్నీరు కారుస్తున్నాడు వసంతుడు. ఈసారి శిలల కోసం కాదు; గీతాలకోసం. శిల్పానికోసం కాదు; కావ్యానికోసం!

ఔను. ఛేదింపబడిన శిల్పపీఠాలపై ఉన్న గీతాలన్నీ చెదరగొట్టబడినై; వర్ణనలన్నీ మటుమాయమయినై.

"నేడు నేను నేర్చుకున్న పాఠం విలువ అమూల్యం. కావ్యమూ శిల్పమూ ఎంత గొప్పవో కాని మానవ హృదయావేశం మాత్రం ఈ రెంటి కన్నా గొప్పది" అన్నాడు వసంతుడు బిగ్గరగానే.

అందెల రవళికి ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. మనోహరి! ఆమె ఉపవనంనుండి బయటకు పోవడం లేదు. వసంతుడివైపే వస్తూన్నది.

"ఎవరూ?...మనోహరియా?" అని అడిగాడు వసంతుడు.

"ఔను. ఈ పోటీలకు కారణమైన పాపిని. మానవుని హృదయావేశపు వింతచిందులను చూస్తున్నాను." అన్న దామె.

"నేనూ అంతే! కానీ, ఏడుస్తున్నాను కూడా" —అన్నాడు వసంతుడు.

"ఇందుకు ఏడవ్వాలా? వివాదంలోని ఒక ఘట్టం మాత్రమేకదా ఇది? ముగింపు చాలాదూరంలో లేదని దీని అర్థం!"

శిల్ప రూపంలో చిత్రింపరాని వైభవంతో కాస్తూంది వెన్నెల. కావ్యరూపంలో వర్ణింపలేని ధ్వనులతో పరుగెత్తుతూంది ప్రక్కనున్న సెలయేరు. వసంతుడు తలెత్తి మనోహరి వదనాన్ని తిలకించాడు. ఎందుకో, మనోహరి నవ్వింది.

"శిలలకు ఇలా నవ్వడం తెలుసా? కావ్యాలు నన్నిలా పలకరిస్తాయా?" అని అడిగాడు అతడు. కొంతసేపు నిశ్శబ్దం.

"ఏమిటో చెబుతున్నారు. చాల కొత్తగా వుంది" అన్నది మనోహరి.

అత డామెనే చూస్తున్నాడు. చల్లని ఆ వెన్నెలలో పిల్ల గాలులకు చెదరిపోతున్న తన ముంగురులను సరిదిద్దుకొంటున్నది మనోహరి.

"ఏదో చెప్పలేని తన్మయత్వం నన్నావరిస్తూంది. నన్ను నేను మరచిపోతున్నాను"—వసంతుడన్నాడు.

మనోహరి అతడిదగ్గరకు వచ్చి నిలబడింది.

చల్లటి గాలి, సువాసనతోడి లత, చెవుల కింపయిన సంగీతం, కన్నులపండువయిన అందం ఇవన్నీ మూర్తీభవించి తనముందు నిలచిన ట్లనుకున్నాడు వసంతుడు!

"మీరు అందాన్ని ఆరాధించేవారు; కాని దానినిగురించి వాదించేవారు కారు" అని మెల్లగా నవ్వింది మనోహరి.

అంతులేని ఆవేశంలో ఉన్న వసంతు డిలా పలికాడు:

"మనోహరీ! నీ స్థితికి జాలిపడుతున్నాను. శిల్పి, కవీ—ఇద్దరూ నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారు. అందువలననే ఈ పోరాటమంతా! ఇది నాకు తెలుసు."

"కావచ్చు. కాని ఆ పోరాటంలో వారు తమ పోరాట లక్ష్యాన్ని మరచిపోతున్నారు. వివాదం ఎక్కువై, వివాదానికి మూలకారణమేదో అది మాయమైంది" అంది. మళ్ళీ ఆ మందహాసమే!

"చంద్రుడి కిరణాలకు శబ్దముంటూ ఉంటే ఇలాగే ఉంటుంది కాబోలు" ననుకున్నాడు వసంతుడు ఆమె చిరునవ్వు విని.

కొంతసేపు ఇద్దరూ ఊరుకున్నారు. తర్వాత అతడడిగాడు: "నీవేమంటావు మనోహరీ? కావ్యమా, శిల్పమా, ఏది గొప్పది?"

"నావరకు, నేను, ఇప్పుడున్న స్థితిలో ఈ రెంటికన్నా గొప్పది మానవహృదయపాశ మంటాను."

"అంటే?"

"అటువంటి హృదయంకోసమే ఇన్ని రోజులుగా వెదకుతున్నాను......కాదు, వెదకుతూం డే దాన్ని" అన్నది మనోహరి.

"నీవు చెబుతున్నది మబ్బుతెరలచాటు చంద్రు నిలాగుంది మనోహరీ!"

"అజయుడూ ప్రభాకరుడూ తమ నేర్పును వెల్లడించడానికి నన్నొక వస్తువుగా తీసుకున్నారు. వారి వైదగ్ధ్యం వెల్లివిరియడానికి నే నొక సాధనం మాత్రమే. నాకోసం తపిస్తున్న, నన్ను కోరుతున్న హృదయం వారిద్దరివద్దా లేదు" అన్నది మనోహరి. ఆమె కండ్లు దూరానవున్న దేనినో చూస్తున్నాయి. ఆమె కండ్లనే చూస్తున్నాడు వసంతుడు.

"మనోహరీ! ఇదంతా నిజమేనా? నిశ్శబ్దంగా కాస్తున్న వెన్నెల, ఒళ్ళు మరిపిస్తున్న ఈ ఉపవనం, నాముందర నిలబడిఉన్న నీవు......మనోహరీ! నా బుద్ధి చెదిరిపోతున్న దే"—వసంతుడి మాటలు తడబడ్డాయి. ఉద్వేగం ఒక్కొక్కసారి మానవుని, కావ్య

శిల్పలో కాల అంచులను దాటి తీసుకుపోతుందని అత నికి అప్పుడే అవగతమైంది.

"మనోహరీ! కావ్యాన్నీ శిల్పాన్నీ అనుభ వించి ఆనందించాను. అవి ప్రాణాలొచ్చి మానవ రూపంలో ప్రత్యక్షమైతే ఎలా ఉంటుందో ఇపుడు తెలుసుకుంటున్నాను."

తన్నుమించిన ఉద్వేగంలో వసంతుడు మనో హరి మృదుహస్తాన్ని గ్రహించాడు. ఎక్కడో కోయిల కూసింది. చెట్టునుండి ఒక పుష్పం రాలింది. మిలమిల మెరిసిపోతూన్న నక్షత్రాల వెలుగులలో వింత వంకరలతో, సంగీతపు ధ్వనులతో సాగిపోతూ న్నది ప్రక్కనున్న సెలయేరు!

## 5

"మా ఇర్వురిని ఆశీర్వదింపవలసిన బాధ్యత మీది" అన్నది మనోహరి. ఆమెప్రక్కనే ఆమె చేతిని తనచేత గీలించి నిలబడ్డాడు మనోహరీ మనో హరుడు—వసంతుడు.

ఏదో తెలియరాని ఆరాటంతో బాధపడుతున్న కళారాధకులిద్దరూ ఉపవనపు నల్దిక్కుల తమ దృక్కు లను ప్రసరించారు.

"మీ నైపుణ్య ప్రదర్శనలో నన్ను మరచిపో గల్గిన వారు మీరు"—మళ్ళీ మనోహరి.

అశ్రువులు నిండిన నయనాలతో ప్రభాకరు డామెను చూచాడు. ఆమె ఇలా అన్నది :

"మీరు నన్ను ప్రేమిస్తున్నారు. నిజమే. కాని అంతకన్నా గాఢంగా మిమ్మల్ని మీరే ప్రేమించు కుంటున్నారు."

"నీకంటె ఎక్కువగా నన్ను నేనే ప్రేమించు కుంటున్నానా?" అని అజయుడు అడిగాడు.

"అవును. నా అందానికన్నా, నా అందాని కొక రూపునివ్వగల మీ హస్తనైపుణ్యాన్ని మీ రెక్కువ ఆరాధిస్తున్నారు. అది సహజమే. కాని కళారాధకుడి ఆ ఆవేశంలో ఒక స్త్రీ హృదయం ఛిన్నాభిన్నమౌతున్నదన్నది గ్రహించడం లేదే!... ఇలా అంటున్నందుకు నన్ను క్షమించండి."

ప్రభాకరుడూ అజయుడూ తల లూపారు. ప్రభాకరుడు పలికాడు.

"నిజమే! నీవు చెబుతున్నదంతా నిజమే! అయినా ఈ నిజం ఎంత చేదుగా ఉన్నదీ?"

ఇంతవరకూ పెదిమలు కదల్పని వసంతు డన్నాడు :

"నెరవేరని ప్రేమ; పూర్తికాని గోపురం; సగంవ్రాసిన కావ్యం; వీటికో ప్రత్యేకమైన ఆకర్షణ వుంది. రసికుడి హృదయసీమలో కల్పనాశక్తి కనుగు ణంగా అవి పరిపూర్ణతను పొందుతాయి."

ప్రభాకరుని పెదవులమీద నవ్వు ప్రకాశిం చింది. దానిలో సంతోషం లేదు, దుఃఖమూ లేదు; కోపం లేదు; నిరాశ లేదు; మనోహరి మళ్ళీ పలి కింది :

"ఏదో మీకు ఉపదేశిస్తున్నాననుకోకండి! నేను వెదకుతున్న వస్తువు దొరికిందన్న ఆనంద పారవ శ్యంతో పలుకుతున్నా. అపజయమని మీరు అనుకుం టున్న ఈ మీ అనుభవం మీ కళకు మరింతశక్తి నివ్వ గల్గిందిగా ఉపయోగపడుతుందని నా ఆశ! జీవితాను భవంలో నా స్వార్థానికి క్షమాపణ కోరుతున్నాను."

అజయుడూ ప్రభాకరుడూ ఒకేసారి పలికారు. వారి స్వరంలో గంభీరత మూర్తీభవించి వుంది.

"మీ ఇద్దరికీ మా మనఃపూర్వకమైన ఆశీర్వా దాలు. మీ ప్రేమను శిల్పం చిత్రిస్తుంది; కావ్యం వర్ణిస్తుంది. మీ ప్రేమ చిరస్థాయిగా ఉండుగాక!"